సమస్యల వలయంలో
చిక్కుకున్న అతణ్ణి
ఆమె కోరిందేమిటి?

# కడుపుకోసం

అంబుజా భూషణ్ కథ

తిరిగి తిరిగి అలసిపోయిన సుబ్రాయుడు చేనుగట్టు మీద కూలబడ్డాడు. మొన్న కురిసిన వానకి మట్టి బాగా మెత్తబడి పులకించిపోతుంటే గట్లు పచ్చబడి గరికతో మెరిసిపోతున్నాయి.

రైతులతో, ఎడ్లతో, వాటి మెడలో చిరుమువ్వల చప్పుడుతో, కూలీలతో, వారి కేకలతో కనుచూపు మేరంతా మహాసందడిగా వుంది. కోలాహలంగా వుంది.

ఆకాశంలో కరిమబ్బులు అమృతం తెస్తున్న దేవతల్లా గుంపులు గుంపులుగా సాగి వస్తున్నాయి శుభసందేశం తెస్తున్నా వివండహో అన్నట్లుగా చల్లగాలి ప్రతి మట్టి పలుకునీ పలకరించిపోతోంది.

సుబ్రాయుడు తన చేనివైపు చూచుకున్నాడు.

పరువాల్తో పెటపెటలాడ్తున్న విధవలా వున్నది. అంగాంగము యవ్వనం పంతరించుకొని కట్నం ఇచ్చుకోలేక పెళ్ళికి మొగంవాచిన బీద కన్యలా వున్నది.

నాకు వయసొచ్చింది నాన్నా నా బ్రతుకు పండించవా! నాకు పెళ్ళి చేయువా! నాన్నా అని దీనంగా అడుగుతున్నట్లుగా వుంది.

సుబ్రాయుడు వంగి దోసిల నిండా మన్ను తీసుకొని రెండు కన్నీటి బొట్లు విడుస్తూ. వుంది తల్లీ నీ బ్రతుకు పండించాలనే వుంది. పచ్చగా నువ్వు బ్రతుకుతుంటే పరవశించాలనీ వుంది. కానీ నేను దురదృష్టవంతుణ్ణమ్మా. అంగట్లో అన్నీ వున్నాయి. అల్లుడి నోట్లో శని అని పదెకరాల భూమి వుంది. వొంటినిండా వోర్పు వుంది. జబ్బ



ల్లో సత్తు వుంది ఏం ప్రయోజనం చేతిలో పైసా లేదు గొణుక్కున్నాడు.

పోయినేడు పెళ్ళాం చెవికమ్మలు తెగనమ్మి చెనిగిత్తనం తెచ్చినాటాడు.

మొక్క మొలిచి మూరెడు పెరిగితే తెగమురిసిపోయాడు.

చేసంతా పసుపు పూలు పూసి విరబూస్తే ఇంటెల్లపాదీ పొంగిపోయారు.

ఆ పువ్వులపై పదునుగా వానజల్లు బడితే తనంత అదృష్టవంతుడు లేడని భుజాలు పొంగించాడు.

లొక్కెళ్ళి లొక్కెళ్ళి అగాధంలోకి తోసిట్లుగా ఉన్నట్లుండి వొక్కసారిగా మబ్బు బిగబట్టింది ఆకాశం పగబట్టింది. ఫలితంగా మొక్క ఎండుముఖం పట్టింది.

వానకోసం ఇంటిల్లిపాదీ ఉపవాసాలున్నారు. పూజలు చేశారు. భజనలు చేశారు. ఐనా వరుణదేవుడు కరుణించలేదు.

గుడ్డి పిల్లలు, కుంటి పిల్లలు పుట్టినట్లుగా అన్నీ సొట్టకాయలు బైటపడ్డాయి. వాన రాకుండానే నిండా మునిగిపోయాడు సుబ్రాయుడు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ కోసం చేసిన అప్పులు అలానే వున్నాయి. వాటి వడ్డీలు అలాగే వున్నాయి. తమ ఆకళ్ళూ అలాగే వున్నాయి.

ఈ ఏడు బాగా వానలు కురుస్తాయని రేడియోల్లో చెప్పారంట. అదునుకు కురుస్తున్నాయి కూడా.

సుబ్రాయుడి చేతిలో చిల్లిగవ్వలేదు. అప్పుకోసం ఊరు మీదబడితే పాత బాకీ అట్టానే వుంది. ఏ ముఖం బెట్టుకు అడుగుతున్నావయ్యా అని అందరూ ఈసడించేవాళ్ళే.

ఏం చేయాలి? ఏం చేయాలి నెత్తిమీద టప్పు టప్పున వాన చినుకులు రాల్తుంటే వాస్తవంలోకి వచ్చాడు సుబ్రాయుడు.

కూలీలు పన్లు ముగించి ఇళ్ళ ముఖం పట్టారు.

మట్టి బాట వెంట నీటిలో ఈదే బాతులా మెల్లగా హొయలు వలుకుతూ వస్తుందో ఎడ్లబండి. బండి వెనక గిత్తన్న మహాహుషారుగా నడుస్తున్నాడు.

సుబ్రాయుడు రెండంగల్లో అతణ్ణి కలుసుకొని బండిమీదున్న మూటలు చూస్తూ పలకరించాడు.

ఏం అన్నా అదంతా చెనిగిత్తనమేనా!

ఔన్రా సుబ్రాయుడూ.

అంతా నీ చేనికేనా ఎవురన్నా భాగం కలిసేరా.

లే నా కొక్కడికే

ఎంత బడిందేమిటి మూట.

తొమ్మిదినూర్లు — నువ్వింకా తేలేదా

లేదన్నా డబ్బులు కుదరలే తలగోక్కున్నాడు.

కుదరలేదని కూసుంటే ఎట్టారా. అదునులోనే పంటేసుకోవాల మనం రమ్మన్నప్పుడల్లా వానొస్తుందేమిటి. ఏదో వొక దారి చూసుకోవాల.

అన్నిదార్లూ మూసుకుపోయాయన్నా.

బీడీ కాలుత్తావా! గిత్తన్న చొక్కా జేబులోంచి బీడీ కట్ట తీశాడు.

ఆ నా ముఖానికి అదొక్కటే తక్కువ వొద్దులే. గిత్తన్న అన్నా వొకటడుగుతాను ఏమనుకోవుగా.

ఏంటది బీడీని పంటకరిచిపట్టి నిప్పుల్లతో కాలుస్తూ అడిగాడు.

నాకో రెండు మూటలు చెనిగిత్తనిమియ్యరాదా పంట రాంగానే తీర్చేత్తాను.

బాగుందిరోయ్ గీరుకునే వాడి దగ్గర గిల్లుకు తినే వోడంట. రూటికోసం నేనెన్ని అవస్థలు పడ్డానో చెప్పినా అర్థం కాదులే.

సుబ్రాయుడూ నీకింకా చిన్నపిల్లలే ఏడ కూలి నాలి చేసుకొచ్చినా ఆళ్ళ కడుపులు

నిండుతాయి. నాకో పెళ్ళికెదిగిన పిల్లలు ఇద్దరున్నారు. కూలి డబ్బుల్తో ఆళ్ళు ఎల్ల మారుతారా చెప్పు. ఇంకో చోట చూసుకో రా.

వాన జల్లుగా మారుతుంటే నవ్వలేక నవ్వుతూ ఇంటిముఖం పట్టాడు సుబ్రాయుడు.

అతడి మనసంతా చెదలు కెలుకుతున్నట్లుగా వుంది.

మెదడంతా కాలిపోతున్నట్లుగా వుంది.

తల్లి ఎప్పటిలా ఖంగు ఖంగున దగ్గుతుంటే విరాగ్గా చూచాడు.

పిల్లలు అలవాటుగా వచ్చి మీదెక్కితే విసిరికొట్టి పంపాడు.

అప్పుడే కూలినుంచి వచ్చి పొయ్యి అంటిస్తున్న తిమ్మక్క భర్త వాలకం గమనించి దగ్గరగా వచ్చింది.

ఏంటయ్యా అట్టా వున్నావ్ వొంట్లో బాగాలేదా నుదురు తాకి చూచింది.

నాకేం గుండులా వుంటేనూ.

మరేంటి అట్టా వున్నావ్.


ప్చ్ ఊరు ఊరంతా అప్పుడే ఇత్తనం కాయ తెచ్చేసుకున్నారు. నాకెక్కడా అప్పు పుట్టలే మునివేళ్ళతో జుట్టు దువ్వుకుంటూ పెదాలు బిగబట్టాడు.

భర్త నాస్థితిలో చూచిన తిమ్మక్కకి దుఃఖం ఆగలేదు. సుబ్రాయుడు మంచి లావు, బాగా పొడగరి. తిమ్మక్కకి పెళ్ళి చూపులనాడు చూచి అర్జునుడల్లే వున్నాడనుకుంది.

తమకి పెళ్ళయిన కొత్తలో ఏం సుఖంగా ఉండాడో. సుబ్రాయుడికి తండ్రి పోతూ పోతూ పదెకరాల భూమే కాకుండా తల్లిని, పెళ్ళికెదిగిన చెల్లెళ్ళని అప్పగించిపోయాడు.

అప్పట్నుంచి ఆడపిల్లల పెళ్ళిళ్ళు, పురుళ్లు అంటూ వొకటే అప్పులు, బాధలు. వానల్లేక భూమిలో వొచ్చిన పంట తినేకే చాలేది కాదు.

తాదూర కంతలేదు మెడకో డోలని తమకి ముగ్గురు పిల్లలు. అంతా తమ దగ్గర



పీక్కుతినే వాళ్ళేగాని ఇంత సహాయం చేసేవాళ్ళే లేకపోయే. బిడ్డల్తో ఎట్టా పీక్కుపోయాడో పిచ్చిమారాజు కళ్ళొత్తుకుంటూ పొయ్యి దగ్గర కెళ్ళింది తిమ్మక్క.

రాత్రి సుబ్రాయుడు కంచం ముందు కూర్చుంటూ అన్నాడు నాకో దారి కనబడతావుందే.

ఏంటయ్యా అది.

డబ్బులకోసం దుర్గ దగ్గరకెళ్దామనుకుంటున్నా. దుర్గ సుబ్రాయుడి రెండో చెల్లెలు. పెద్ద చెల్లిది తమకి లాగే అతుకులు బొతుకులు సంసారం ఐనా దుర్గ కాస్త మంచి ఇంట్లో బడింది.

చెడి చెల్లెలింటికి ఎల్లరాదంట. మొన్న పురుడుకు తీసుకొచ్చి ఎండి మొలతాడు పెట్టలేదని నానా రబసచేసి ఎల్లాడు దుర్గ మొగుడు అసలు పలకరిత్తాడా! వొద్దయ్య ఎల్లొద్దు.

మరేం చేద్దాం చేను బీడు బెడదామా!

వొద్దులే గేదెనమ్మేయి.

ఉలిక్కిపడ్డట్టుగా చూచేడు సుబ్రాయుడు. దాన్ని అమ్మి పిల్లలకి ఆ కాత్త కూడూ లేకుండా జేత్తే ఎట్టాగే.

మరేం చేద్దాము పంట లేకపోతే డబ్బులెట్టా అప్పులాళ్ళు పీక్కుతినరూ.

పోయినేడూ ఇట్టాగే అని కమ్మలమ్మించినావు.

పోన్లేయ్యా ప్రతి ఏడూ వొకే రీతిగా వుంటుందా. ఈ ఏడన్నా ఆ ఎంకటేశ్వర స్వామి దయ చూడడా పైకి చూచి చేతులు జోడించింది తిమ్మక్క.

ఏమయ్యో లేలే తిమ్మక్క తట్టి లేపుతుంటే భారంగా కళ్ళు తెరిచాడు సుబ్రాయుడు.

చెట్టు సందుల్లోంచి సూర్య కిరణాలు చురుక్కుమనిపించాయతని కళ్ళని.

ఏమిటే కళ్ళు నులుముకుంటూ అడిగాడు.

పిల్లలు చూడయ్యా ఆకలి ఆకలని ఎట్టా గోల జేత్తున్నారో. ఆళ్ళ బాధ పడలేక డబ్బున్న మారాజులందరి దగ్గరా మొరబెట్టుకున్నా ఇన్ని గింజలేయమని. లేవంటే లేవన్నారు. నువ్వన్నా ఎల్లి అడిగితే ఇత్తారేమో బేగలే కళ్ళు తుడుచుకంది తిక్కమ్మ.

సుబ్రాయుడు కళ్లు తిప్పి పిల్లల వంక చూచాడు. వడలిన తోటకూర కడల్లా తిండికోసం వేలాడబడిపోతున్నారు.

ఆ దేవుడికి మన మీద కనికరం లేకపోయె. కూడు లేదని నానా అవస్థ పడుతుంటే మీ అమ్మకి మళ్ళీ జరం తిరగబెట్టింది.

కటిక నేలమీద బడి మూల్గుతున్న తల్లి దగ్గరకెళ్ళి ఆమె పండు వెంట్రుకలు నిమురుత్తూ అన్నాడు.

ఎట్టాగుందే అమ్మా.

బరువుగా కళ్ళు తెరిచింది సుబ్రాయుడి తల్లి. సుబ్రాయుడూ ఎన్ని కష్టాలొచ్చినాయిరా బిడ్డా నీకు ఇంత చిన్న వయసులో. ఏ బాధలు నీకుగాక నేనో గుండిబండలా దిగబడ్డా గదరా. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా ఆ దేవుడు ఉన్న చిన్న నీడను కూడా లాగేసుకున్నాడు కదరా! బిడ్డా చిన్న పిల్లలా వలవలా ఏడ్చేసింది.

సుబ్రాయుడు బాధగా ఇంటివైపు చూ

చాడు. ఏముందక్కడ బుట్టెడు బూడిద తప్ప.

తిమ్మక్క చెప్పినట్లుగానే సుబ్రాయుడు గేదెనమ్మేసి ఇత్తనం కాయ తెచ్చాడు. ఇంటెల్లి పాదికీ ఇంత తీపి కూడా తెచ్చాడు.

మర్నాడు పొద్దునే ఇంత చద్దన్నం తిని హుషారుగా వీధిలో కొచ్చాడో లేదో ఊరు ఊరంతా వొకటే గోల రాజీవ్‌గాంధీ సచ్చిపోయాడంట. బాంబు బెట్టి ఎవరో కాల్చేశారంట అంటూ మగాళ్ళు దుఃఖాన్ని లోలోనే దిగమింగుకుంటుంటే, ఆడవాళ్ళు పట్టలేక శోకాలు పెట్టి ఏడ్వసాగారు.

ఈళ్ళ చేతు లిరిగిపోను ఎవరికే మాయ రోగం వచ్చిందంట బంగారు తండ్రిని పొట్టనబెట్టుకున్నారు.

పచ్చని చెట్టుని నిలువునా కూల్చేశారు కదరా! ఆ బాబు కళ్ళల్లో ఎంత దయ, ఎంత ప్రేమ. తను సచ్చిపోతే తన కళ్ళని ఎవరికన్నా దానం చెయ్యమన్నాడట. చావక ముందే బలవంతంగా కళ్ళు బెరికేశారు కదా!

ఆ సక్కదనాల ముక్కుని చెక్కేసినారు కదా!

కోట్ల ప్రజల్ని కన్నతండ్రిలా చూసుకుంటుంటే నిలువునా కాటేసినారుకదయ్యా.

తమ గొడుగుని తామే చించేసుకున్నారు కదయ్యా.

కాలుబోతే కాలు ఏసుకోవచ్చు. కన్నుబోతే మరో కన్ను పెట్టుకోవచ్చు. పేణం పోతే మళ్ళీ ఎల్లా వత్తాదయ్యా.

ఆ తల్లీబిడ్డల్నుంచి విడదీసి కాల్చేసేకి మీకు పేణం ఎట్టా వొప్పిందయ్యా. ఆళ్ళని వొంటరి పచ్చుల్లా శపించేరెందుకయ్యా.

ప్రపంచం ముందుకు పోతోంది. ఎంతో ప్రగతి సాధిస్తోంది అంటున్నారు. ఎన్నెన్నో అద్భుతాలు సృష్టిస్తోంది అంటున్నారు.

అద్భుతాలంటే ఆప్తుల్ని ఇలా అదృశ్యం చెయ్యటమేనా? ఇలా వెన్నుపోటు పొడవటమేనా?



## దొంగ

కోటిలింగాన్ని పిఎ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.
"దీపావళినాడు పుట్టినోడు గజదొంగ అవుతాడుగాని మీరు ఎంఎల్ఏ ఎల్లాగయ్యారు సార్?"
"ఆ వృత్తి అంతగా అచ్చి రాలేదని వదిలేశాక రాజకీయాల్లోకి వచ్చా నా..."
"..."

—పి.సునీత (వడ్లమూరు)

ఒక ఇల్లుగాదు, ఒక ఇల్లాలు కాదు. ఒక ఊరు కాదు, ఒక వాడగాదు దేశం దేశమే విలపిస్తోంది. గుండెలు బాదుకుంటోంది.

బుడగలో ఎంత గాలి పడ్తుందో అంతే నింపాలి. లేకుంటే అది పగలటం తథ్యం. చెరువులో నీరు గట్టున్నంతవరకే చేరాలి. లేదంటే మహమ్మారిలా విరుచుకుపడుతుంది. అభిమానం కూడా అంతే దానికో హద్దంటూ వుండాలి. అది పెచ్చుమీరితే కార్చిచ్చులా దహిస్తుంది.

తమ ప్రియతమ నాయకుడు తమకిక లేడన్న సత్యం అభిమానుల్ని పిచ్చివాళ్ళని చేసింది. రెచ్చగొట్టేసింది. ఆవేశాలు కావేశాలతో ముట్టేసింది.

ఫలితంగా ఎటు చూచినా కత్తిపోట్లు, రక్తపుటేరులు, శవాలు, స్మశానాలు.

ఊర్లకి ఊర్లు చెక్కలు ముక్కలైపోయాయి.

మన తోటలో విచ్చుకున్న పువ్వు మనకొక్కళ్ళకే పరిమిళం ఇవ్వదు. చుట్టుపక్కల వాళ్ళకి కూడా పంచుతుంది.

సినిమాహాళ్లు, ఫేక్టరీలని చీల్చి చెండాడిన అగ్ని సుబ్రాయుడి లాంటి పేద కొంపలకి కూడా పాకింది.

సుబ్రాయుడు తన కళ్ళముందే ఇల్లు మాడిమాసైపోతుంటే కట్టుబట్టలతో, కుటుంబ సభ్యులతో కన్నీళ్ళతో వెర్రాడిలా చూస్తుండటం తప్ప ఏమీ చేయలేకపోయాడు.

దురదృష్టం మరో మారు కశిదీరా కాటేసింది.

మళ్ళీ కోలుకోలేనంతగా కృంగిదీసింది.

నాన్నా ఆకలి నాన్నా, అమ్మ చూడు అన్నం పెట్టమంటే పెట్టడం లేదు. పిల్లలు తన చుట్టూ చేరి దీనంగా అడుగుతుంటే ఆలోచనల్లోంచి ఇవతలకొచ్చాడు.

ఏంచేయాలి. ఏంచేస్తే పిల్లల్ని ఆకలి కోరల్నుంచి, తల్లిని జబ్బు ఉచ్చునుంచి తప్పించగలడు. ఊర్లో అందరికీ తనమీద పీకలవరకూ కోపం వుంది అప్పులు తీర్చలేదని. ఇప్పుడు భార్యకే ఇవ్వని వాళ్ళు తమకేం ఇస్తారు.

ఏం చెయ్యాలి, ఏం చేయాలి

తనకి సహాయం చేసేవాళ్ళే లేరా?

తన నాదుకునే హస్తమే లేదా!

సుబ్రాయుడి కళ్ళముందు రంగురంగుల గాజులతో శకుంతల చేయి నిల్చింది. శకుంతల ఆ ఊరి షావుకారు రెండో భార్య.

పెళ్ళయి ఐదేళ్ళయినా తల్లి కాలేకపోయింది. చూడ చక్కనిది.

సుబ్రాయుడంటే తగని ఇష్టం. అతడు కన్పిస్తే చాలు కవ్వించేది, రెచ్చగొట్టేది ఐనా చూసీ చూడనట్లుగా వచ్చేసేవాడు.

ఒకరోజు మునిచీకటి పడ్తున్నవేళ అప్పుకోసం తిరిగి తిరిగి సప్పముఖం వేసుకొని వెళ్తుండగా ఎదురుపడింది.

ఆ డబ్బేదో నేనిస్తాను.. నాకు వడ్డీ అక్కర్లేదు. అసలు కూడా అవసరం లేదు. నాకో సాయం చెయ్యి అన్నది.

ఏంటది ముఖం చిట్లించాడు సుబ్రాయుడు.

నాకు పిల్లలంటే తగని ఇష్టం. అమ్మా

అని పిలిపించుకోవాలని నా మనసు తపించి పోతోంది. డాక్టర్లు నాలో ఏ లోపం లేదన్నారు. నాకు నీనుంచి బిడ్డ కావాలి. తమకంగా అతడ్ని చుట్టుకుపోయింది.

ఛీ... ఛీ... అంటూ ఛీత్కారం చేసి వచ్చేశాడు.

తనంటే ఆకలికి ఓర్చుకోగలడు లేదా పస్తులుండి చావగలడు.

కానీ లేవలేని తల్లి, తన పసి కూనలు ఏం పాపం చేశారని బలవంతంగా చంపాలి.

ఏం ఘోరం చేశారని బలి ఇవ్వాలి.

తను నాటే కడవులకు చల్లలా ఊబిలో నున్న తనకి తాడులా

వాడిపోతున్న తమ వంశ వృక్షానికి నీరులా శకుంతలే కన్పిస్తుంటే వొక నిర్ణయానికి వచ్చినట్టుగా లేచినుంచున్నాడు సుబ్రాయుడు.

కొన్నాళ్ళకి శకుంతలే కాదు సుబ్రాయుడి చేసుకూడా నీళ్ళోసుకుంది. ✱

# ముద్దు జాగ్రత్త!

పదే పదే తమ పాపాయి చెక్కిలిమీదా, పెదవిమీదా ముద్దులు పెట్టుకునే తల్లులకు, పాపాయికి సెరెలాక్‌లాంటి బేబీఫుడ్ పెడ్తూ చెంచాతో రుచిచూసి అదే చెంచాతో పాపాయికి తినిపించే తల్లులందరికీ ఓ సలహా!

మీ నోటిని, పళ్ళని బాగా శుభ్రంగా ఉంచుకోండి. లేకపోతే మీ ద్వారా పాపాయికి ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది.

ఈ విషయంమీద ఓ స్టడీ జరిగింది. ఒక గ్రూప్ తల్లుల పళ్ళని, నోటిని శుభ్రంగా ఉంచుకునేలాగ చేసారు. నోటిని ఏమాత్రం శుభ్రంగా ఉంచుకోని తల్లులను కూడా ఈ స్టడీలో పరిగణనలోకి తీసుకున్నారు.

రెండున్నర సంవత్సరాల తర్వాత గమనిస్తే జాగ్రత్తగా వున్న తల్లుల పిల్లలకి



ఏ రకమైన నోటి ఇన్‌ఫెక్షన్లు రాలేదు. కానీ రెండో రకం తల్లుల పిల్లలకి 27 శాతం పంటి సమస్యలు వచ్చాయి.

స్వీడన్‌లో జరిగిన ఈ స్టడీ పిల్లలకోసమైనా తల్లుల్ని జాగ్రత్త పడేందుకు ఉపకరిస్తుంది.

- గురజాడ శోభా పేరిందేవి